క్లుప్తంగా

దోమల వృద్ధిని నివారించాలి



ఏటూరునాగారం: పాత కూలర్లు, కొబ్బరి బొండాలు, గోలాలు ఇంటి ఆవరణలో ఉంటే వాటిలో నీరు నిల్వ చేరి దోమలు వృద్ధి చెందుతాయని, అలాంటి వాటిని నివారించాలని కోయగూడ ఎల్లాపురం సర్పంచ్ గార రమాదేవి అన్నారు. మంగళవారం మండలంలోని గ్రామ పంచాయతీ పరిధిలోని రాంనగర్‌లో డ్రైడే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికి తిరిగి గోలాలు, డ్రమ్ముల్లో ఉన్న నీటి నిల్వలను వైద్య సిబ్బందితో కలిసి తొలగించారు. ఈగలు, దోమలు రాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యశాఖ, గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రజలు సహకరించి చెత్తాచెదారం ఎక్కడబడితే అక్కడ పడేయవద్దన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఫీల్డ్ అసిస్టెంట్, పాల్గొన్నారు.

రామాలయ కమిటీ అధ్యక్షుడిగా మోహన్‌రావు



ఎస్‌ఎస్ తాడ్వాయి : మండలంలోని కాటాపూర్ రామాలయ కమిటీ నూతన కార్యవర్గాన్ని మంగళవారం సర్పంచ్ పుల్లూరి గౌరమ్మ అధ్యక్షతన ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దిడ్డి మోహన్‌రావు, ఉపాధ్యక్షుడిగా కుసుమ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శులుగా దండు నరేష్, ముంద్రాతి రమేష్, సలహాదారులుగా మద్దూరి రాములు, ముత్తినేని లక్ష్మయ్య, ఇందారపు లాలయ్య, మేడిశెట్టి నర్సింహయ్య, సహాయ కార్యదర్శులుగా మామిడోజు మల్లికార్జునచారి, దంగెల్లి విజయ్, కోశాధికారులుగా గద్దం రాజ్‌కుమార్, తడక హరీష్‌తో పాటు కార్యవర్గ సభ్యులుగా శ్రీను, సత్యంను ఎన్నుకున్నారు.

నేటి నుంచి సమ్మక్క సారలమ్మ జాతర

కన్నాయిగూడెం: మండలంలోని బుట్టాయిగూడెంలో బుధవారం నుంచి సమ్మక్క సారక్క వన దేవతల జాతర ప్రారంభం కానుంది. ఉదయం దేవర పూర్వ జ్ఞాపకాల రూపాలను డోలీల మధ్య శివసత్తుల పూనకాలతో గంగ స్నానాలు ఆచరించి జాతరను ప్రారంభిస్తారు. పూర్వం నుంచి సునారికాని (దేవరోల) వారి కుటంబంలో వెలిసింది. వారితో పూజారులు ఆదివాసీ వంశస్తులతో జాతరను జరుపుతారు. మండలంలోని దట్టమైన అడవిలోని రంగురాళ్ల గుట్ట నుంచి సమ్మక్కను గురువారం తీసుకువస్తారని వేడారం ట్రస్టుబోర్డు డైరెక్టర్ పాడెం శోభన్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

మల్హర్: కాండం తొలుచు పురుగు నివారణకు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి ముంజ మహేష్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని రుద్రారం, చిగురుపల్లి శివారుల్లోని వరి పంట పొలాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో 12 వేల ఎకరాల్లో వరి సాగువుతుందని తెలిపారు. వరిపంట నాటు నుంచి పిలకపెట్టే దశలో ఉందన్నారు. ప్రస్తుత వాతవరణ పరిస్థితుల దృష్ట్యా వరి కాండం తొలుచు పురుగు ఉధృతి కనబడుతుందన్నారు. కాండం తొలుచు పురుగులార్వా మొక్కకు రంధ్రం చేసి తినడంతో మొక్క చనిపోతుందని వివరించారు. తొలుచు పురుగు నియంత్రించడానికి నాటు పెట్టిన పది రోజుల్లో కార్టప్ హైడ్రోక్లోరైడ్ (బరోజ్) లేదా క్లోరంత్రనెల్లిప్రోల్ (ఫటేర్ర) గుళికలను ఎకరానికి నాలుగు కిలోల చొప్పున వాడుకోవాలన్నారు. పిలక దశలో ఉన్న వరి పొలంలో పురుగు ఉధృతి గమిస్తే పురుగు ఉధృతినిబట్టి కార్టప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్పీ 2 గ్రాములు లీటరు నీటిలో లేదా క్లోరాంతినిలిప్రోల్(కోరాజన్, కోర్ ప్రిమ) ఎకరానికి 60ఎంఎల్ లేదా బైఫెంత్రిన్ 10 ఈసీ 2 మీల్లి లీటర్లు ఒక లీటర్ నీటిలో కలిపి వాడడంతో కాండం తొలుచు పురుగు మొదటి దశలో నివారించుకోవచ్చని వెల్లడించారు. జింక్‌దాతు లోపం నివారణకు నీటిలో కరిగే జింక్ సల్ఫేట్‌ను 2 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి వాడుకోవాలని లేదా జినేత్ర ద్రవరూప జింక్‌ను కూడా 250 మిల్లీలీటర్లు ఒక ఎకరానికి వాడుకోవాలని సూచించారు. పంటలో వచ్చే సమస్యలపై 7288894164 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఇష్టారాజ్యంగా పాస్‌వర్డ్ వాడకం

కాళేశ్వరం: కాళేశ్వరం దేవస్థానంలో కంప్యూటర్, సీసీ కెమెరాల పాస్‌వర్డ్ ఉద్యోగులు, సిబ్బంది చేతుల్లోకి ఫలహారంగా మారినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గోప్యంగా ఉండే కంప్యూటర్, సీసీ కెమెరాలకు సంబంధించిన పాస్‌వర్డ్ పలువురు ఉద్యోగుల వద్దకు చేరడంతో వారంతా యధేచ్ఛగా వాడుకున్నోళ్లకు వాడుకున్నంత చందంగా తయారైందని తెలిసింది. దేవాదాయశాఖకు చెందిన ముఖ్యమైన వ్యవహారాలు, ఇతర విషయాలు బయటికి రాక ముందే అధికారులు స్పందించి పాస్‌వర్డ్ గోప్యంగా ఉంచాలని భక్తులు కోరుతున్నారు.

ప్రారంభానికి సిద్ధంగా పోలీస్‌స్టేషన్

- నూతన హంగులతో నిర్మాణం
- సిబ్బందికి ప్రత్యేక భవనాలు



తుపాకులగూడెంలో నిర్మించిన నూతన పోలీస్‌స్టేషన్ భవనం

కన్నాయిగూడెం : మండలంలోని తుపాకులగూడెం వద్ద నిర్మించిన పోలీస్‌స్టేషన్ నూతన భవనం ప్రారంభానికి సిద్ధమైంది. చిన్న చిన్న పనులు మినహాయిస్తే తప్ప అన్ని పనులు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. ఒకప్పుడు మావోయిస్టులకు కంచుకోటగా తుపాకులగూడెం ఉండడంతో దానిని దృష్టిలో ఉంచుకుని భద్రతను పటిష్టం చేస్తూ ఏర్పాటు చేశారు. ఏటూరునాగారం మండలం నుంచి 11 గ్రామ పంచాయతీలను వేరు చేస్తూ కొత్తగా కన్నాయిగూడెంను మండలం ఏర్పాటు చేశారు. మండలానికి ప్రత్యేక పోలీస్‌స్టేషన్ లేకపోవడంతో తాత్కాలికంగా తుపాకులగూడెంలో సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద ప్రారంభించి విధులు కొనసాగిస్తున్నారు. శాశ్వత భవన నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు ఏర్పాటు చేయడంతో నూతన హంగులతో భవన నిర్మాణం చేపట్టారు. ఉన్నతాధికారుల చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేస్తారని విశ్వసనీయ సమాచారం.

దేవాదుల పంపుహౌస్‌కు ప్రత్యేక భద్రత

తుపాకులగూడెంలోని గోదావరిపై ప్రభుత్వం కొన్ని వేల కోట్లతో సమ్మక్క ఎత్తిపోతల పథకంను నిర్మించారు. వాటి భద్రతలో భాగంగా రక్షణను దృష్టిలో ఉంచుకొని సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద నూతన హంగులతో చుట్టు భద్రత వలయాలను ఏర్పాటు చేస్తూ పోలీస్‌స్టేషన్ చేపట్టారు. కన్నాయిగూడెం మండలం ములుగు జిల్లాలోనే మూరుమూల ప్రాంతంతో పాటు మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా ఉన్న ఛత్తీస్‌గఢ్ ప్రాంతానికి ఆనుకొని ఉండడంతో ఎప్పటికప్పుడు అటు నుంచి వారు గోదావరి దాటకుండా కట్టడి చేయవచ్చు.

సిబ్బందికి ప్రత్యేక భవనాలు

సిబ్బందికి నివాసం కోసం ఎలాంటి లోటు రాకూడదనే ఆలోచనతో ప్రాంగణంలోనే సిబ్బందికి భవనాలను నిర్మిస్తున్నారు. ఈ భవనాలు దాదాపు పూర్తి కావచ్చాయి. ఉన్న పనులను కూడా అధికారులు దృష్టి సారించి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న గోవింద్‌నాయక్

ఎస్‌ఎస్ తాడ్వాయి : సీఎం కేసీఆర్ ములుగు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి అయన హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం జిల్లా ఏర్పాటు చేయడంతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. వర్షాకాలంలో వరద సమయంలో జిల్లాలోని ఏటూరునాగారం పర్యటనకు వచ్చిన సందర్భంగా రోడ్లను మరమ్మతులు చేపడుతామని ఇచ్చిన హామీ ప్రకారం ఐటీడీఏ ఆధ్వర్యంలో అన్ని రోడ్లకు అభివృద్ధికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర కాదు మోకాళ్ల యాత్ర చేసినా ప్రజలు వారిని నమ్మరన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సీతక్క జిల్లాకు చేసిందేమి లేదన్నారు. సమావేశానికి ముందు తాడ్వాయిలో గ్రంథాలయాన్ని పరిశీలించారు. గ్రంథాలయ భవనం శిథిలావస్థలో ఉంటడంతో నిరుపయోగంగా ఉంటున్న మండల పరిషత్ పాఠశాల భవనంలో గ్రంథాలయం ఏర్పాటు చేయడం కోసం పరిశీలించారు. సమావేశంలో రైతు కమిటీ జిల్లా అధ్యక్షుడు బుచ్చయ్య, జాతర మాజీ చైర్మన్ కొర్నెబెల్లి వీరేశం, మాజీ మండల అధ్యక్షుడు బండారి చంద్రయ్య, ఉపసర్పంచ్ ఇంద్రారెడ్డి, నాయకులు చల్లా రజనీకర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, జయపాల్ రెడ్డి, లింగాచారి, కొర్నెబెల్లి శేషగిరి, పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని రేవంత్‌కు వినతి



ఏటూరునాగారం: రేవంత్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న నేతకాని సంఘం నాయకులు



వెంకటాపురం(ఎం): చేపల బుట్టను బహూకరిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

ఏటూరునాగారం : ములుగు జిల్లాలోని నేతకాని కులస్తుల సమస్యలను పరిష్కరించాలని, అందుకు అండగా నిలవాలని నేతకాని మహర్ కుల హక్కుల పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షుడు జాడి రాంబాబు అన్నారు. మంగళవారం వెంకటాపురం(ఎం) మండలంలో జరిగిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాదయాత్రలో సంఘం నాయకులు కలుసుకొని వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ నేతకానిజాతి (దళితులు)తెలంగాణ రాష్ట్రంలో ఏజెన్సీ ప్రాంతంలో తరతరాల నుంచి ఆదివాసులతో మమేకమై జీవిస్తున్నామన్నారు. పూర్వకాలంలో మా నేతకాని జాతి నేతనేసి (దొడ్డునేత) బట్టలు తయారుచేసి ఆదివాసీ ప్రజలకు ఏజెన్సీ ప్రాంతంలో జీవిస్తున్న ఇతర కులాల ప్రజలకు అందించే వారమన్నారు. కేంద్రంలో, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక మా జాతి అభివృద్ధి కొరకు అన్ని విధాలుగా సహకరించి మా అభివృద్ధికి బాటలు వేయాలని కోరామన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గం లక్ష్మీకాంత్, జిల్లా అధికార ప్రతినిధి దుర్గం రాజు, భీం సైనిక్‌దళ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి వెంకట్, జిల్లా నాయకులు సునార్కని రాంబాబు, కొండగొర్ల మోహన్‌రావు, కుమ్మరి నర్సింహులు, దుర్గారావు , కుమార్, నరేష్, సురేందర్, దశంతరావు పాల్గొన్నారు.

వెంకటాపురం(ఎం): టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డికి రామప్పలో ములుగు జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు బొల్లు దేవేందర్ ఆధ్వర్యంలో ముదిరాజ్ నాయకులు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ముందుగా శాలువా కప్పి చేపలబుట్ట, వల బహూకరించారు. కార్యక్రమంలో నాయకులు చిటమట రఘు, గండి కుమార్, సాదు రాఘు, పిట్టల వెంకటస్వామి, నర్సింహారావు, కంబాల రవి, సాంబయ్య, సురేష్‌లు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి

జిల్లా ఉపాధ్యాయ ఉద్యోగ ఐక్యవేదిక ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని వివిధ సంఘాల నేతలు కలిసి సీపీఎస్‌ను రద్దు చేసి 317 జీఓ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వివిధ సంఘాల నాయకులు ఏళ్ల మధుసూదన్, అన్నవరం రవికాంత్, సంజీవ, మంకిడి రవి, సుభాష్, హట్కార్ సమ్మయ్య, సర్వర్ అహ్మద్, రాందేవ్, బోడ కుమార్, పవన్‌లు ఉన్నారు.

అభివృద్ధికి సహకరించాలి



టేకుమట్ల: మండలంలోని ఆశిరెడ్డిపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా సర్పంచ్ వెలిశెట్టి స్వర్ణలత సురేష్, ఎన్ఆర్ఐలు, గ్రామస్తులు సోమవారం ఎమ్మెల్సీ సిరికొండ మధుసూధనాచారిని కలిసి ఆలయ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు. గ్రామంలోని అన్ని ప్రధాన కూడళ్లలో హైమాస్ట్ లైట్లతో పాటు గ్రామంలోని అన్నిచోట్ల పూర్తిస్థాయి ఎల్ఈడీ లైట్లను మంజూరు చేసినట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామానికి సెంట్రల్ లైటింగ్‌తో పాటు, ల్ఈడీ లైట్లను మంజూరు చేసిన ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



వాజేడు : ఆర్థికసాయం అందజేస్తున్న సర్పంచ్



మంగపేట : నగదు అందజేస్తున్న నాగరమేష్

వాజేడు: మండల పరిధిలోని చింతూరులో సోమవారం మేడిచర్ల పెదనర్సయ్య పూరిల్లు కాలిపోగా సుమారు రూ 1.30 లక్షల విలువ చేసే ఆస్తినష్టం జరిగింది. మంగళవారం సర్పంచ్ తెల్లం బుల్లేశ్వరావు, వైస్ ఎంపీపీ భర్త అల్లి సూరిబాబు, బీఆర్ఎస్ నాయకుడు కొత్తగట్టు సాంబమూర్తి బాధిత కుటుంబానికి రూ.5000 ఆర్థికసాయం అందించారు. వీటితో పాటు రూ.25 కిలోల బియ్యం, కూరగాయలు అందజేశారు. బాధిత కుటుంబానికి డబుల్ బెడ్రూమ్ ఇల్లు మంజూరుకు కృషి చేస్తామని నూగూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బుచ్చయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి తెలిపారు.

వాడగూడెంలో వృద్ధ దంపతులకు..

మంగపేట : మండలంలోని వాడగూడెం గ్రామానికి చెందిన పల్లె భిక్షం, నర్సమ్మ నిరుపేద వృద్ధ దంపతులకు శ్రీ రామకృష్ణ సేవా ట్రస్టు చైర్మన్ బాడిష నాగరమేష్ రూ. 2500 నగదును ఆర్థికసాయం మంగళవారం అందజేశారు. అదేవిధంగా రమణక్కపేటలోని సీఎస్ఐ చర్చికాలనీ యూత్‌కు వాలీబాల్ కిట్ కొనుగోలు కోసం రూ.2000 నగదును అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ బాడిష నవీన్, సభ్యులు ఇందారపు రమేష్, మహేష్, ప్రవీణ్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పట్టించుకోని అధికారులు

- కార్యాలయాలకే పరిమితమవుతున్న ఏఈఓలు
- అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు
- వాడీవేడిగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగరాజు

వెంకటాపురం(కె) : మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. ఎంపీపీ చెరుకూరి సతీష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలు సమస్యలపై అధికారులను ప్రజా ప్రతినిధులు నిలదీశారు. మండలంలో రైతుల సమస్యలను వ్యవసాయ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని, ఏఈఓలు ఎవరూ గ్రామాల్లో పర్యటించకుండా కార్యాలయాలకే పరిమితమవుతున్నారు. పంటలకు వచ్చే చీడపీడల నివారణకు తీసకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు చెప్పేవారు లేకుండా పోయారని రామచంద్రాపురం సర్పంచ్ అట్టం సత్యనారాయణ ఏఓ నర్సింహారావును నిలదీశారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు వచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. ఎదిర, సూరవీడు, మంగవాయి గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు లేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని వైస్ ఎంపీపీ సయ్యద్ హుస్సేన్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మండలంలో పోడు భూములకు హక్కు పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఇవ్వాలన్నారు. మండలంలో 1750 మంది దరఖాస్తు చేసుకోగా కేవలం 74 మంది మాత్రమే అర్హులుగా గుర్తించడం ఎంతవరకు సమంజసమని బర్లగూడెం సర్పంచ్ నర్సింహామూర్తి అధికారులను నిలదీశారు. గ్రామాల్లో పోడు భూముల కోసం చేసిన దరఖాస్తులను తిరిగి గ్రామ సభలు పెట్టి పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



అధికారులను నిలదీస్తున్న రామచంద్రాపురం సర్పంచ్ సత్యనారాయణ

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రాస్తారోకో



రాస్తారోకో విరమించుకోవాలని చెబుతున్న ఎస్సై

మంగపేట: మండలంలోని రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏటూరునాగారం- బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తోకల రవి మాట్లాడుతూ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం బోధించేందుకు ఉపాధ్యాయుడిని నేటి వరకు నియమించలేదన్నారు. అలాగే రమణక్కపేటలో ప్రాథమికోన్నత పాఠశాలలో 90 మంది విద్యార్థులకు కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారన్నారు. అందులో ఒకరు హెచ్ఎం మరొకరు ఉపాధ్యాయుడు. దీంతో ఒకటి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు విద్యాబోధన సక్రమంగా అందడం లేదన్నారు. ఈ విషయంపై సంబంధిత ఉన్నతాధికారులకు పలుమార్లు లిఖిత పూర్వకంగా వినతిపత్రం అందించినా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు సక్రమంగా విద్యాబోధన జరిగే విధంగా చూడాలని లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో దశవారీగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థుల రాస్తారోకోతో రోడ్డుపై వచ్చి పోయే ఇసుక లారీలు, ఇతర ప్రైవేటు వాహనాలు ఎక్కడి క్కడే నిచి పోయాయి. విషయం తెలుసుకున్న ఎస్సై తాహెర్‌బాబా సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులను రోడ్లపైకి తీసుకువచ్చి రాస్తారోకో చేయడంతో ట్రాఫిక్ అంతరాయం కలుగుతుంది తప్ప ఎలాంటి లాభం ఉండబోదన్నారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుపోయి పరిష్కరించుకోవాలని సూచించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

‘పుట్ట’ ట్రస్టు ఆధ్వర్యంలో అవగాహన తరగతులు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కాటారం: పుట్ట లింగమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తరగతులను మంగళవారం ప్రారంభించారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో లక్ష్య సాధన పెంపొందించే దిశగా తీసుకోవాల్సిన చర్యలు, పరీక్షల సమయంలో మనోధైర్యం, భవిష్యత్తులో ఉన్నత చదువులు, ఎంచుకోవాల్సిన కోర్సులు ఇతరత్రా అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ బిక్షపతి మాట్లాడుతూ పుట్ట లింగమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం ఇలాంటి తరగతులు నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. హైస్కూల్ మోటివేషన్ శిక్షకులు శ్రావణ్‌కుమార్, మనోజ్‌కుమార్, ఎచ్ఎం రాజమల్లు, బీఆర్ఎస్ నాయకులు శ్రీలక్ష్మిచౌదరి, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ వంగల రాజేంద్రాచారి, నాయకులు రజనీకాంత్, రజాకర్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని జూబ్లీనగర్‌లో ఇటీవల అగ్ని ప్రమాదంలో ఇల్లును కోల్పోయి నిరాశ్రయులైన పర్ష లక్ష్మీ కుటుంబాన్ని మంగళవారం భూపాలపల్లి నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు పరామర్శించి, ఆర్థికసాయం అందించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం నుంచి అన్ని విధాలా ఆదుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య, ఉన్నారు.

మంటలు చెలరేగి కారు దగ్ధం

మల్హర్ : మండలంలోని కొయ్యూరు పెట్రోల్‌బంకు సమీపంలో ఒక్కసారిగా కారులో మంటలు చెలరేగి దగ్ధమైంది. కొయ్యూరు ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం..భూపాలపల్లికి చెందిన ఎదలాపురం శ్రీనివాస్ కారులో మంథని నుంచి భూపాలపల్లి వెళ్తున్నాడు. ఈక్రమంలో మంగళవారం తెల్లవారు జామున ఒంటిగంట సమయంలో కారు నుంచి పొగలు వస్తుండటంతో కొయ్యూరు పెట్రోల్‌బంకు సమీపంలో కారును నిలిపి కిందికి దిగి పరిశీలించాడు. ఒక్కసారిగా మంటల లేచి కారు పూర్తిగా దగ్ధమైంది. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలి



మాట్లాడుతున్న సర్పంచ్ రామ్మూర్తి

ఏటూరునాగారం: వ్యక్తిగత శుభ్రతను అందరూ పాటించాలని, వ్యాధులకు దూరంగా ఉండాలని సర్పంచ్ ఈసం రామ్మూర్తి అన్నారు. మంగళవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో హెచ్ఐవీ, ఎయిడ్స్, టీబీ, సుఖ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం సంస్థ ద్వారా హెచ్ఐవీపై గ్రామంలోని ప్రజలకు అవగాహన కార్యక్రమాలు, సేవలను అందిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. గ్రామంలోని ప్రజలందరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐసీటీసీ కౌన్సిలర్ గుటగట్టు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారి హెచ్ఐవీ స్థితిని రక్తపరీక్షల ద్వారా మాత్రమే తెలుసుకుంటారని, ఒకవేళ పాజిటివ్ నిర్ధారణ అయితే ముందుగానే ఏఆర్టీ మందుల ద్వారా వ్యాధి నివారణ చేసుకోవచ్చని చెప్పారు. చైల్డ్ ఇన్ఫో డిస్టిక్ రిసోర్స్‌పర్సన్ జ్యోతి మాట్లాడుతూ హెచ్ఐవీ అనేది అంటువ్యాధి కాదు, ఇది ఒక వైరస్ ద్వారా మాత్రమే నాలుగు మార్గాల ద్వారా వ్యాప్తి చెందుతుంది అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కార్ల అరుణ, పంచాయతీ సెక్రెటరీ అశోక్, జూనియర్ అసిస్టెంట్ రవీందర్, బిల్ కలెక్టర్ వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికభారాన్ని తగ్గించేందుకే హెల్త్‌క్యాంపు



వైద్యులను సన్మానిస్తున్న సర్పంచ్ రాజమ్మ

భూపాలపల్లి రూరల్: పేద, మధ్యతరగతి కుటుంబాల వారికి ఆర్థికభారాన్ని తగ్గించేందుకు హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ప్రధాన్ ఆస్పత్రి వైద్యుడు తొటం ప్రధాన్ అన్నారు. మండలంలోని ఆజాంనగర్‌లో సర్పంచ్ గోవిందుల రాజమ్మ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాకేంద్రంలోని ప్రధాన్ ఆస్పత్రి వారు మెగా హెల్త్‌క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన్ మాట్లాడుతూ ఈ శిబిరంలో ఉచితంగా షుగర్, బిపి, దంత పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చినట్లు తెలిపారు. గ్రామస్తులకు ఆరోగ్య సలహాలు, సూచనలు చేశారు. వైద్యసేవలు అందించిన ఆస్పత్రి వైద్యులను, సిబ్బందిని సర్పంచ్ రాజమ్మ గ్రామస్తులతో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు అనూషప్రధాన్, లింగమూర్తి అచ్చ,ఆస్పత్రి వ్యవస్థాపకుడు తొటం ప్రభాకర్, గ్రామ కార్యదర్శి శశిధర్, కారోబార్ పూర్ణచంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్మారక క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ ఆడుతున్న మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసరావు

మల్హర్: మండలంలోని మల్లారంలో కోట మణిచరణ్ స్మారకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీని మాజీ జెడ్పీటీసీ గోనె శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. క్రీడల్లో గెలుపొందిన జట్లకు ప్రథమ బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు నగదును అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆవిర్నే ప్రకాష్‌రావు, సుంకు రాము, శివయ్య, రవి, మధుకర్, సమయ్య, రమేష్, లింగయ్య, పురుషోత్తమరావు, సమ్మయ్య పాల్గొన్నారు.